సాక్షి
వికారాబాద్
శుక్రవారం ၊ 10 ၊ అక్టోబర్ ၊ 2025



పడకేసిన పశువైద్యం

బషీరాబాద్ మండలంలోని గొట్టిగఖుర్దు ప్రాథమిక పశువైద్య కేంద్రం పది రోజులుగా తెరుచుకోవడం లేదు. 8లో▸



అక్రమ రవాణాకు అడ్డేది!

అటవీ సంపద రక్షణకు ప్రభుత్వాలు పనిచేస్తుంటే.. అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా కలప రవాణా చేస్తున్నారు. 8లో▸



అధ్వానంగా రోడ్లు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బంట్వారం మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. 9లో▸

న్యూస్‌రీల్

నామినేషన్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

నవాబుపేట: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం, తహసీల్దార్ బుచ్చయ్య, ఎంపీడీఓ అనురాధ పాల్గొన్నారు.

వసతులు కల్పించండి



ఏటీసీ భవనాన్ని పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

కందుకూరు: ఫ్యూచర్‌సిటీ పరిధిలోని పంజగూడ రెవెన్యూలో నిర్మించిన ఏటీసీ (అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్)ని గురువారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవనంలోని గదులు, మిషనరీ ఏర్పాటును పరిశీలించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.లక్ష్మణ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏటీసీ భవన నిర్మాణం 95 శాతం పూర్తయిందని, ఇంకా మిషనరీ రావాల్సి ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులకు అందుబాటులో ఉండేలా అవసరమైన పరికరాలతో పాటు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ ఆయనకు సూచించారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్, సిబ్బంది ఉన్నారు.


మహాసభలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ సభ్యులు

మొయినాబాద్: తుర్కయంజాల్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించే మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని మున్సిపల్ కార్మికులంతా పెద్ద ఎత్తున తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ వర్కర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రత్నం, అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షులు ప్రవీణ్, నర్సింహ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో అధ్యాపకుడి ప్రజెంటేషన్



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేస్తున్న డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్: తమిళనాడులోని సెంట్రల్ యూనివర్సిటీలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ స్పాన్సర్‌షిప్‌తో నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు గురువారం షాద్‌నగర్‌కు చెందిన అర్థశాస్త్ర అధ్యాపకుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా క్లైమేట్ చేంజ్ అండ్ ఎనర్జీ ఫర్ వికసిత్ భారత్ –2047 అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. వాతావరణంలో మార్పులతో దేశంలో ఆర్థిక వ్యవస్థ ఏవిధంగా ప్రభావితం అవుతుందని అనే అంశాన్ని వివరించారు.

అంతా ఆగిపోయె!

స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు బ్రేక్

- ఇలా నామినేషన్లు .. అలా నిలిపివేత
- మళ్లీ మొదటికొచ్చిన ఎన్నికల ప్రక్రియ
- అంతర్మథనంలో ఆశావహులు
- రిజర్వేషన్లపై ఆయా పార్టీల నేతల పరస్పర ఆరోపణలు
- ఇది ప్రభుత్వ వైఫల్యమే.. కాదు ప్రతిపక్షాల కుట్ర
- తప్పు మీదంటే మీదేనని విమర్శలు



వికారాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిండంపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ వీడటం లేదు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసి పది రోజులు కావస్తున్నా ఇంకా అయోమయ పరిస్థితులే ఉన్నాయి. బీసీ రిజర్వేషన్లపై కొందరు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 9పై స్టే విధించడంతో ఉత్కంఠ నెలకొంది. పాత రిజర్వేషన్ల ప్రకారం వెళితేనే ఎన్నికలు జరుగుతాయనే వాదన తెరపైకి వచ్చింది. అయితే ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. దీంతో ఆశావహులు మరి కొన్ని రోజులు వేచి చూడక తప్పదు. హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో ఆయా పార్టీల నాయకులు పరస్పర ఆరోపణలు, తప్పు మీదంటే మీదేనంటు విమర్శలు చేసుకుంటున్నారు.

ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో..

స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఏడాదిన్నరగా ఎదురు చూస్తున్న నేతలు ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. ఎన్నికలు జరుగుతాయా..? జరగవా..? ఒకవేళ నిర్వహిస్తే ప్రస్తుత రిజర్వేషన్లతోనా.. లేకుంటే పాత రిజర్వేషన్ల ప్రకారమా అనే అయోమంలో ఉన్నారు. వార్డులు, గ్రామాలు, మండలాల్లో రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చినా అడుగు ముందుకు వేయలేకపోతున్నారు.

పార్టీలకతీతంగా సహకరించాలి

బీసీ రిజర్వేషన్లు ఆ సామాజిక వర్గానికి దక్కాల్సిన న్యాయమైన హక్కు. దశాబ్దాల నిరీక్షణ తర్వాత ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించింది. ఇందుకు అన్ని పార్టీలు సహకరించాలి. తమ హక్కుల సాధన కోసం పార్టీలకతీతంగా పోరాటం చేస్తాం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీల ఓట్లతో గద్దెనెక్కే నాయకులు ఇప్పుడు న్యాయమైన వాటా అడిగితే వారి కుటిల బుద్ధి చూపిస్తున్నారు.

– లాల్‌కృష్ణప్రసాద్,
బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్రలతోనే..

కుల్కచర్ల: బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్రలతోనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు దక్కకుండా పోతోందని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ ఆరోపించారు. గురువారం ఆ పార్టీల తీరును తప్పుపడతూ కుల్కచర్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి మంచిపేరు వస్తుందనే అక్కసుతోనే బీజేపీ ఈ బిల్లు ఆమోదించకుండా చేసిందన్నారు. బీఆర్‌ఎస్ పరోక్షంగా బీసీలకు రిజర్వేషన్లు వర్తించకుండ కేసులు వేయించడం జరిగిందన్నారు. బీసీలు రాజకీయంగా ఎదగడాన్ని ఓర్వలేక ఆ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినమాట ప్రకారం కులగణన నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతోనే బిల్లు పెట్టిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీటీసీ మాజీ సభ్యుడు అనందం, మాజీ సర్పంచ్ వెంకటయ్య, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వెంకటయ్య, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, నాయకులు రాంరెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, కృష్ణయ్య, ఎం వెంకటయ్య, రాములు, అనంతయ్య, లక్ష్మయ్య, సాయన్న, శివ,తదితరులు పాల్గొన్నారు.

❖ అడ్డుకోవడం దారుణం



బందయ్య

కుల్కచర్ల: బీసీలకు రాజ్యాధికారం దక్కకుండ కొందరు అడ్డుకోవడం ఆవేదన కలిగిస్తోందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు బందయ్య అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చట్టాలను పూర్తిస్థాయిలో తెలుసుకోకుండా రిజర్వేషన్లు కల్పించి తప్పు చేసిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. అగ్రవర్ణాలు సైతం బీసీల ఎదుగుదలను ఓర్వలేక ఇలా కోర్టుల్లో కేసులు వేసి వారికి రాజ్యాధికారాన్ని దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

❖ రిజర్వేషన్లు ప్రభుత్వ డ్రామా



సురేశ్

దుద్యాల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని బీఆర్‌ఎస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బోగమోని సురేశ్ ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్ల ఆశ చూపి కోర్టులో కేసులు వేయించారని విమర్శించారు. తద్వారా ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేయాలని చేస్తోందన్నారు. వెంటనే ఎన్నికలు జరిగేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.



ధరలు పైపైకి..!

- భగ్గుమంటున్న కూరగాయల రేట్లు
- ఆకుకూరలదీ అదే పరిస్థితి
- ఏకధాటి వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- తగ్గిన దిగుబడి.. అమాంతం పెరిగిన ధరలు
- పావుకిలో, అరకిలోతో సరిపెట్టుకుంటున్న జనం

హుడాకాంప్లెక్స్: ఏకధాటి వర్షాలు.. వరదలు కాయగూరల ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పంటలు దెబ్బ తినడం.. దిగుబడి భారీగా తగ్గిపోవడం వెరసి ఇటు రైతులను, అటు కొనుగోలుదారులను నష్టాల్లోకి నెట్టేస్తున్నాయి. కూరగాయలే కాదు ఆకుకూరల ధరలు సైతం అదే స్థాయిలో పెరిగాయి. నిన్న మొన్నటి వరకు కిలో రూ.40లోపే పలికిన వంకాయ, బీన్స్ ధర బహిరంగ మార్కెట్లో సెంచరికీ చేరువలో ఉన్నాయి. ఇక పచ్చిమిర్చి, కాకర, దొండ, దోసకాయ, గోకర, బీర ధరలు సైతం రెట్టింపయ్యాయి. పాల కూర, తోటకూర, పుదీనా, బచ్చలికూర, చుక్కకూర, గోంగూర, కొత్తిమీర ధరలు కూడా అమాంతం పెరిగాయి. సాధారణ రోజుల్లో కట్ట రూ.5లోపే విక్రయించగా ప్రస్తుతం ఏ ఆకుకూర కొనాలన్నా ఒక్కో కట్టకు రూ.10 వెచ్చించాల్సి వస్తోంది.

బోర్డు ధరలకు భిన్నంగా..

సరూర్‌నగర్ మార్కెట్, ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్లకు సాధారణ రోజుల్లో రోజుకు సగటున 480 క్వింటాళ్ల కాయగూరలు దిగుమతి అవుతుండగా, వారాంతాల్లో 520 నుంచి 600 క్వింటాళ్ల వరకు దిగుమతి అవుతున్నాయి. యాచారం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, మహేశ్వరం, అబ్దుల్లాపూర్‌మెట్ పరిసర ప్రాంతాల నుంచి ఇక్కడికి తెచ్చి విక్రయిస్తుంటారు. ఇటీవల కురిసిన ఏకధాటి వర్షాలు, వరదల కారణంగా పంటలు పాడై దిగుమతి భారీగా తగ్గింది. డిమాండ్ మేర సరఫరా లేకపోవడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. అంతేకాదు ఆయా మార్కెట్లలోని బోర్డులపై ఉన్న ధరలకు.. బయట ఉన్న ధరలకు పొంతనే ఉండడం లేదు. రైతు బజార్‌లోని వ్యాపారులు సైతం బోర్డుపై ఉన్న ధరలకు భిన్నంగా విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలతో ఒకప్పుడు కిలో కొనుగోలు చేసిన వారు ప్రస్తుతం అర కేజీతో సరిపెట్టుకుంటున్నారు.

రైతులకు బదులు వ్యాపారుల తిష్ట

ఎప్పటికప్పుడు ధరలను నియంత్రించాల్సిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు వ్యాపారులు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి .. అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై ఫిర్యాదు చేసినా.. చర్యలకు వెనుకాడుతున్నారు. రైతుబజార్లలో రైతులకు బదులు వ్యాపారులు తిష్టవేశారు. పంట తీసుకుని వచ్చిన వాళ్లను లోనికి రాకుండా అడ్డుకుంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో వారు ఆయా మార్కెట్ల ముందు ఉదయం, రాత్రి ప్రధాన రోడ్డుకు అటుఇటుగా కుప్పలు పోసుకుని అమ్ముకోవాల్సి వస్తోంది. ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేస్తుండటం, తక్కెడ, బాట్లను ఎత్తుకెళ్లిపోతుండటంతో రైతులు తమ పంటను తక్కువ ధరకే దళారులకు అమ్ముకుని పోతున్నారు.

అర కిలోతో సరి



ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కాయగూరల ధరలు భగ్గుమంటున్నాయి. ఏది కొనాలన్నా కిలో 60రూపాయలపైనే చెల్లించాల్సి వస్తోంది. దీంతో అరకిలో, పావు కిలో కొనుగోలు చేస్తున్నాము. వ్యాపారులు కేజీ తీసుకుంటే ఒక ధర.. అరకేజీ తీసుకుంటే మరో ధర చెబుతున్నారు.

– లక్ష్మి, గృహిణి

రోడ్డు విస్తరణలో అవకతవకలు




నేషనల్ హైవే సెట్‌బ్యాక్‌ను కొలతలు వేస్తున్న బీజేపీ నాయకులు

- అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గిన కాంట్రాక్టర్
- బీజేపీ నాయకుల ఆరోపణ

తాండూరు టౌన్: తాండూరు పట్టణం మీదుగా వెళ్తున్న నేషనల్ హైవే 167 (ఎన్) రోడ్డు విస్తరణ పనుల్లో అవకతవకలు జరిగాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం ఆరోపించారు. గురువారం ఆయన నాయకులతో కలిసి పట్టణంలోని సెయింట్ మార్క్స్ పాఠశాల నుంచి బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా కాంట్రాక్టర్ తీసిన సెట్‌బ్యాక్‌ను పరిశీలించారు. పలు చోట్ల సెట్‌బ్యాక్‌ను కొలతలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 50 ఫీట్ల మేర సెట్ బ్యాక్ ఉండాల్సిన చోట తక్కువగా ఉందని తెలిపారు. సుమారు 40 చోట్ల కొలతలు వేయగా 33 ఫీట్లు, 38 ఫీట్లు, 40 ఫీట్లు, 48 ఫీట్లుగా సెట్ బ్యాక్ ఉండటాన్ని తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న నేషనల్ హైవే పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం, అధికార పార్టీ లోకల్ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా సెట్‌బ్యాక్ తీశారన్నారని ఆరోపించారు. 50 ఫీట్ల సెట్ బ్యాక్ ఉండాల్సిన చోట తక్కువ ఉండటం అనుమానాలకు తావిస్తోందన్నారు. నాయకులకు చెందిన ఆస్తులకు ఎలాంటి నష్టం జరుగకుండా సెట్‌బ్యాక్‌లో అవకతవకలు జరిగాయని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా నిబంధనల ప్రకారం తిరిగి 50 ఫీట్ల వరకు సెట్ బ్యాక్ తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రాజు, ఉపాధ్యక్షులు కృష్ణ, ప్రకాష్, ప్రహ్లాద్, కిరణ్, రాంచందర్, బిచ్చప్ప, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

అబ్దుల్లాపూర్‌మెట్: క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేష్ పేర్కొన్నారు. మండలంలోని బాటసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న 69వ హయత్‌నగర్ జోనల్ లెవల్ కబడ్డీ టోర్నమెంట్‌తో పాటు క్రీడాకారుల ఎంపికను గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కేవలం సిలబస్ పూర్తిచేయడం పైనే దృష్టి పెట్టకుండా విద్యార్థులకు చదవడం, రాయడం, గణిత ప్రక్రియలు వచ్చేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాఘవ రెడ్డి, హయతనగర్ జోనల్ సెక్రటరీ నిర్మల, పీడీలు చంద్రమోహన్, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, ఉషాకిరణ్, దాసరి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేశ్

13న ఐటీఐలో అప్రెంటిషిప్ మేళా

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ఐటీఐలో ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్ నరేంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బయోడేటాతోపాటు పదో తరగతి, ఐటీఐ మార్క్స్ మెమో, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9177472488లో సంప్రదించాలని సూచించారు.

వెరీ గుడ్డు

- ఉడికించిన దానిలో పోషకాలు మెండు
- పిల్లల ఎదుగుదలకు దోహదం
- రోజూ తింటే మంచిదంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ గుడ్డు దినోత్సవం



నవాబుపేట: కోడి గుడ్డులో పోషకాలు అధికంగా ఉంటాయన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే చాలా మంది కూరగా, ఆమ్లెట్‌గా తినేందుకు ఇష్టపడతారు. కానీ ఉడికించిన గుడ్డును తింటే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెబుతున్నారు. చిన్నపిల్లలు తినడం ద్వారా శారీరకంగా ధృడంగా ఉంటారని సూచిస్తున్నారు. పౌష్టికాహారలోపంతో బాధపడేవారు నిత్యం ఒక గుడ్డు తీసుకోవడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడుతుందని చెబుతున్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా తీసుకోవడం మంచిదని తెలిపారు. ఏటా అక్టోబర్ రెండో శుక్రవారం ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని జరుపుకొంటారు.

ఎన్నో పోషకాలు

ఉడికించిన గుడ్డులో ఎన్నో పోషకాలు ఉంటాయి. ప్రొటీన్లతో పాటు క్యాల్షియం, మెగ్నీషియం, పాస్పరస్, పొటాషియం, ఐరన్ వంటివి ఉంటాయి. వీటితో పాటు విటమిన్ ఏ, – బీ 6, బీ – 12, – సీ విటమిన్లు ఉంటాయి. గుడ్డును బలవర్ధక ఆహారంగా పరిగణిస్తారు.

కలిగే లాభాలు

రోజూ గుడ్డు తినడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం ధృడంగా తయారవుతుంది. చిన్నపిల్లల శారీరక ఎదుగుదలకు దోహదం చేస్తుంది. ఊబకాయ సమస్య రాదు. అనారోగ్యంతో బాధపడే వారికి ఎంతో మేలు చేస్తుంది. గుడ్డును వేడిగా ఉన్నప్పుడే తినడం మంచిది. ఉడికించి పక్కన పెట్టిన చాలా సేపటికి తినడం మంచిదికాదు. నిల్వ ఉంచడం ద్వారా దానిపై హానికర బ్యాక్టీరియా చేరుతుంది. ఉడికించిన రెండు మూడు గంటల్లోపే తినాలి. పచ్చ సొనతో పాటు తినడం మంచిది. డయాబెటిక్, షుగర్ వ్యాధిగ్రస్తులు వారానికి రెండు చొప్పున పచ్చసొన లేకుండా తినొచ్చు.

అన్నింటికి మంచిది

ఉడకబెట్టిన గుడ్డులో 70 రకాల కేలరీల అత్యంత విలువైన మాంసకృత్తులు, విటమిన్లు ఉంటాయి. ఒక రకంగా చెప్పాలంటే గుడ్డు మల్టీవిటమిన్ మాత్ర అని చెప్పవచ్చు. కల్తీ చేయడానికి వీలులేనిది. కొద్ది రోజుల పాటు నిల్వ ఉండేదే. రోజూ తింటే మెదడు చురుగ్గా పని చేస్తుంది. శరీరానికి శక్తిని ఇవ్వడంతో పాటు బరువు తగ్గిస్తుంది.

అంకెల్లో ఇలా..

- గుడ్డులో ప్రొటీన్లు 93.7శాతం ఉండగా, పాలలో 84.5 శాతం, చేపల్లో 76.0శాతం లభిస్తాయి.
- ప్రతి మనిషి సగటున ఏడాదికి 180 కోడిగుడ్లు తినాలని భారత జాతీయ పోషకాహార మండలి సిఫారసు చేసింది.

జాగ్రత్తలు తప్పని సరి

- గుడ్డుపై క్యూటికల్ అనే పొర ఉంటుంది. కడిగినప్పుడు అది దెబ్బ తింటుంది. అందుకే గుడ్డును కడగకుండా నిల్వ ఉంచడం మంచిది.
- కొనే టప్పుడు గుడ్డును అటూ ఇటూ తిప్పి చూడాలి. లోపల సొన కదిలితే పాడైనట్లు లెక్క. నీటిలో వేసినప్పుడు మునిగితే మంచిది. తేలితే పాడైనట్లుగా గుర్తించాలి.
- మచ్చలు లేని తెల్లగుడ్డునే కొనాలి. గుడ్డుపై కోళ్లకు సంబంధించిన వ్యర్థాలు లేకుండా చూసుకోవాలి.

ఉడికించిన గుడ్డులో ఉండే పోషకాలు

ప్రొటీన్లు	–	4 గ్రాములు
సోడియం	–	55 మిల్లీ గ్రాములు
క్యాల్షియం	–	2.3 ,,
మెగ్నీషియం	–	3.3 ,,
పాస్పరస్	–	4.9 ,,
పొటాషియం	–	53.8 ,,
పోలేట్	–	1.3 మైక్రో గ్రాములు
సెలీనియం	–	16.6 ,,

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ

గుడ్డు పోషకాహారం కావడంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తోంది. రోజకు ఒకటి చొప్పున అందజేస్తున్నాం. జిల్లాలో సుమారు 7,303 మంది పిల్లలు, 15 వేల మంది గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ గుడ్డు తీసుకోవడం చాలా మంచిది. చిన్నపిల్లలు తినడం ద్వారా శారీరకంగా ధృడంగా ఉంటారు.

– కృష్ణవేణి, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి

పిల్లల ఎదుగుదలకు దోహదం



తక్కువ ఖర్చులో లభించే పోషకాలు గుడ్లు మాత్రమే. పచ్చ సొన కూడా ఆరోగ్యానికి మంచిదే. ఇందులో డి 3 విటమిన్ ఉంటుంది. ఇది పిల్లల్లో ఎముకలు గట్టిపటడానికి తోడ్పడుతుంది. పోషకాహారలోపంతో బాధపడుతున్న వారికి తప్పనిసరిగా గుడ్డు అందించాలి. శిశువు 9 నెలల వయస్సు నుంచే తినిపించవచ్చు.

– రోహిత్, పీహెచ్‌సీ వైద్యాధికారి, నవాబుపేట

క్లుప్తంగా

జీపీఓలకు క్లస్టర్ల కేటాయింపు

యాలాల: నూతనంగా విధుల్లో చేరిన గ్రామ పంచాయతీ అధికారుల(జీపీఓ)కు క్లస్టర్లను కేటాయించినట్లు తహసీల్దార్ వెంకటస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కోకట్, యాలాల ఇన్‌చార్జిగా సంధ్యారాణి, అగ్గనూరు-1, అగ్గనూరు-2కు మనిగిరి ఆంజనేయులు, రాస్నం నీరటి నర్సింలు, బెన్నూరు, దేవనూరులకు తలారి యాదయ్య, నాగసముందర్, ముద్దాయిపేటకు చాకలి మల్లయ్య, జుంటుపల్లి కావలి ఆంజనేయులు, తిమ్మాయిపల్లి సుజాత, కమాల్‌పూర్ నవనీత, పగిడియాల శ్రీనివాస్‌లను కేటాయించినట్లు చెప్పారు.

ప్రభుత్వ వాహనం బోల్తా

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



బోల్తా పడిన డీసీఎం

దోమ: ప్రభుత్వ వాహనం(డీసీఎం) అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటన మండల పరిధిలో గురువారం చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఐనాపూర్ సమీపంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో పరిగి నుంచి ప్రభుత్వ వాహనం (డీసీఎం) వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ తీసుకెళ్తుండగా దిర్సంపల్లి అనుబంధ గ్రామం అనంతరెడ్డిపల్లి సమీపంలో రోడ్డు గుంతలమయంగా ఉండి వ్యాన్ బోల్తాపడింది. గ్రమనించిన స్థానికులు డ్రైవర్‌ను బయటకు తీసుకువచ్చారు. ఆయనకు స్వల్పగాయాలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



ఘనశ్యామ్(ఫైల్)

పహాడీషరీఫ్: కూరగాయల కొనుగోలుకు వచ్చిన కార్మికుడు కనిపించకుండా పోయాడు. ఈ ఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన ముఖేశ్‌కుమార్, ఘనశ్యామ్(55) తుక్కుగూడ హార్డ్‌వేర్ పార్క్‌లో కార్మికులు. ఈ నెల 6వ తేదీన స్థానికంగా కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఘనశ్యామ్ అదృశ్యమయ్యాడు. స్థానికంగా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం ఆయన సహచర కార్మికుడు ముఖేశ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

గాంధీనగర్‌లో పాలిటెక్నిక్ విద్యార్థిని..



స్నేహ(ఫైల్)

మీర్‌పేట: ఇంటి ఎదుట ముగ్గు వేస్తున్న యువతి అదృశ్యమైంది. ఈ ఘటన గురువారం మీర్‌పేట ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. బడంగ్‌పేట్‌లోని గాంధీనగర్‌కు చెందిన తాండ్ర మహేశ్ కూతురు స్నేహ(20) పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఉదయం ముగ్గు వేసేందుకు బయటకు వెళ్లిన ఆమె కాసేపటికి కనిపించకుండా పోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శరత్ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ మహేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

యువకుడి హత్య కేసులో నిందితుడికి రిమాండ్

రాజేంద్రనగర్: తల్లితో సహజీవనం చేస్తున్న యువకుడిని హత్య చేసిన కేసులో నిందితుడిని రాజేంద్రనగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పర్‌పల్లి ఫోర్ట్‌వ్యూవ్ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న యాసిర్(28) అదే అదే ప్రాంతానికి చెందిన మహిళతో సహజీవనం చేస్తున్నాడు. తన ఫ్లాట్‌లోనే మహిళతో పాటు ఆమె నలుగురు కుమారులతో కలిసి ఉంటున్నాడు. కొన్నాళ్లుగా వీరి మధ్య మనస్పర్థలు రావడంతో తరచూ ఘర్షణ పడుతున్నారు. బుధవారం ఉదయం యాసిర్, సదరు మహిళకు మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న మహిళ పెద్ద కుమారుడు ఆయాన్(18) కత్తితో యాసిర్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన యాసిర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

రౌడీషీటర్లకు బైండోవర్

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధిలోని ఎనిమిది మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు, కుర్మిద్దలో ఒక్కరు, సార్లపల్లిలో ఇద్దరు, మీర్‌ఖాన్‌పేటలో ఇద్దరు, మాలగూడలో ఒక్కరిని గురువారం యాచారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ చెప్పారు.

27 మంది బెల్టు దుకాణాదారులకు..

మండల పరిధిలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న 27 మంది నిర్వాహకులను గురువారం యాచారం తహసీల్దార్ అయ్యప్ప ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. తక్కళ్లపల్లి నుంచి తొమ్మిది, గడ్డమల్లయ్య గూడ నుంచి ఎనిమిది, కొత్తపల్లి నుంచి ఆరు, చింతపట్ల నుంచి ఇద్దరు, భానుతండా, చౌదర్‌పల్లి ఒక్కొక్కరిని బైండోవర్ చేశామన్నారు.

పడకేసిన పశువైద్యం



పది రోజులుగా మూతపడిన గొట్టిగఖుర్దు ప్రాథమిక పశువైద్య కేంద్రం

- గొట్టిగఖుర్దు ప్రాథమిక పశువైద్య కేంద్రానికి తాళం
- పది రోజులుగా తెరుచుకోని రెడ్డిఘణాపూర్ ఉప పశువైద్య కేంద్రం
- ఇబ్బంది పడుతున్న పశుపోషకులు

బషీరాబాద్: మండంలోని గొట్టిగఖుర్దు ప్రాథమిక పశువైద్య కేంద్రానికి పది రోజులుగా తాళం పడింది. ఇక్కడ పనిచేస్తున్న వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారిణి విలాసిని 15 రోజుల పాటు మెడికల్ లీవ్ పెట్టారు. దీంతో ఈ నెల 1వ తేదీ నుంచి దవాఖాన మూతపడింది. ఈమె స్థానంలో ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించేందుకు సైతం సిబ్బంది లేకపోవడంతో ఆస్పత్రి తెరుచుకోలేదు. వీఎల్‌ఓ ఇన్‌చార్జిగా ఉన్న రెడ్డిఘణాపూర్ దవాఖాన సైతం పదిరోజులుగా మూతపడింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోగాల బారిన పడిన మూగజీవాలకు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. దీంతో పాడిరైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. బషీరాబాద్ పశువైద్య కేంద్రంలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

175 మూగజీవాలు మృత్యువాత

మండల పరిధిలోని 39 పంచాయతీలకు గాను రెండు ప్రైమరీ వెటర్నరీ ఆస్పత్రులు, రెడ్డిఘణాపూర్, మైల్వార్‌లలో రెండు ఉప పశువైద్య కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ఆవులు, ఎద్దులు 8,340, గేదెలు 2,456, గొర్రెలు 11,602, మేకలు 12,895, కోళ్లు 15,757 ఉన్నాయి. ఏదైనా మూగజీవి అనారోగ్యానికి గురైతే ప్రాణాలు పోవల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనధికారిక లెక్కల ప్రకారం మూడు నెలలుగా 175 పశువులు మృత్యువాత పడినట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశు వైద్యులను, సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న శోభరాజు బృందం

తిరుమలనాథుడి సన్నిధిలో అన్నమయ్య కీర్తనలు

పూడూరు: మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ తిరుమలనాథ స్వామి ఆలయంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభరాజు బృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గురువారం అన్నమయ్య కీర్తనలు, పలు దైవ సంకీర్తనలు పాడి భక్తులను అలరించారు. ఈ సందర్భంగా శోభరాజు శిష్యులు రన్విత్‌రెడ్డి, ఆశ్రిత, పద్మశ్రీ చైత్ర, మానస పటేల్, అభిరామ్ తదితరులను ఆలయ పూజారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పీఠాధిపతి వెంకటదాసు, ఆలయ ధర్మకర్తలు సంగీత , గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాంచందర్(ఫైల్)

యాలాల: ద్విచక్ర వాహనానికి అడ్డువచ్చిన అడవి పందిని తప్పించేందుకు యత్నించి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని జుంటుపల్లికి చెందిన రాంచందర్(46) గతంలో రేషన్ డీలర్‌గా పనిచేసేవాడు. ఉదయం ఆయన వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై తాండూరుకు వెళ్లాడు. రాత్రి 7గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా రసూల్‌పూర్ సమీపంలోని పెట్రోల్‌పంప్ వద్ద అడవిపంది అడ్డుగా రావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయాలై అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రుడిని స్థానికులు తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య లలితమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న హరికృష్ణ

బండ్లగూడ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బండ్లగూడ జాగీర్ మాజీ సర్పంచ్ గంగని హరికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని గురువారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ల చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు సాయశక్తుల కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానన్నారు. తెలంగాణ ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ జల్‌పల్లి నరేందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ఆటో ప్రయాణికుల భద్రతే లక్ష్యం కావాలి
- సైబరాబాద్ అదనపు డీసీపీ హన్మంత్‌రావు



ఆటో డ్రైవర్లతో పోలీసు అధికారులు

మణికొండ: ప్రయాణికులకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ జి.హన్మంత్‌రావు అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, గౌలిదొడ్డిలోని ప్రధాన్ కన్వెన్షన్‌లో గురువారం గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటో డ్రైవర్‌లు తప్పనిసరి యూనిఫాం ధరించాలని, ఆటోకు సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి ఆ మత్తులో డ్రైవింగ్ చేయవద్దని, ఆటో ప్రయాణం సుఖవంతంగా ఉంటేనే ప్రయాణికులు ఆదరిస్తారన్నారు. రోడ్లపై కేటాయించిన స్టాండ్‌లలోనే ఆటోలను నిలపాలని, ఎక్కడ పడితే అక్కడ నిలిపినా, ట్రాఫిక్ జాంలకు, ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఆటో డ్రైవర్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని, అందులో ఎలాంటి తప్పులు దొరకకుండా చూసుకోవాలని సూచించారు. మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కె.చంద్రశేఖర్‌రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్ జి.లవకుమార్, ఎస్‌ఐ వీరబ్రహ్మం, ఎస్‌ఐలు, 200 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రయ ముఠా అరెస్టు

రూ. 7.50 లక్షల విలువ చేసే 107.4 గ్రాముల కొకైన్ స్వాధీనం

మణికొండ: గుట్టు చప్పుడు కాకుండా డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఈగల్ టీంతో కలిసి నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ముంబైకి చెందిన కార్తికేయశేఖర్, అనంతకుమార్ కొన్నేళ్లుగా కొకైన్‌ను వినియోగించడమే గాక దానిని ముంబై నుంచి తెచ్చి సహచరుల ద్వారా హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. వారికి వీరబాబు అనే వ్యక్తి డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరోకు చెందిన ఈగల్ టీం ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, గోపీ నేతృత్వంలో గురువారం నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి మంచిరేవుల వద్ద అనంతకుమార్, వీరబాబులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 7.50 లక్షల విలువ చేసే 107.4 గ్రాముల కొకైన్, రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు కార్తికేయ శేఖర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులు నేరం అంగీకరించటంతో వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అక్రమ రవాణాకు అడ్డేది!



అక్రమంగా తరలిస్తున్న కలప

అటవీ సంపద రక్షణకు ప్రభుత్వాలు పనిచేస్తుంటే.. అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా కలప రవాణా చేస్తున్నారు. అడవుల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం నిర్వహిస్తుంటే అక్రమార్కులు చెట్లను నరికేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

- పట్టపగలే ఫ్యాక్టరీలకు కలప తరలింపు
- అడ్డగోలుగా వృక్షాలు నరికేస్తున్న అక్రమార్కులు
- లారీకి రూ.5వేలు వసూలు చేస్తున్నట్లు అధికారులపై ఆరోపణలు

ఇబ్రహీంపట్నం రూరల్: పచ్చని చెట్లపై గొడ్డలి వేటు వేస్తున్నారు. ప్రకృతి సంపదను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ సందపను కాపాడాల్సిన అధికారులు అక్రమంగా కలప రవాణా చేస్తున్నా పట్టించుకోవడం లేదంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమార్కులకు అధికారుల అండదండలు

ఇబ్రహీంపట్నం ఫారెస్టు రేంజ్ పరిధిలో వృక్షాలు అడ్డగోలుగా నరికి వేస్తున్నారు. వేప, తుమ్మ, మామిడి, చింత, టేకు తేడా లేకుంటా కొట్టి వేస్తున్నారు. రేంజ్ పరిధిలోని మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున కంపెనీలున్నాయి. వీటి బాయిలర్ కోసం కలప విరివిగా వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం అటవీ శాఖ అనుమతి తీసుకుని పనికిరాని చెట్లనుంచి వచ్చే కలప మాత్రమే వినియోగించాలి. రియల్‌ఎస్టేట్ వెంచర్ల పేరిట రియల్ వ్యాపారులు, బాయిలర్‌ల కోసం కంపెనీల యాజమాన్యాలు వృక్షాలను అడ్డగోలుగా నరికేస్తున్నారు. అధికారులు సైతం వారిచ్చే నజరానాలు పుచ్చుకుని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమార్కులకు అధికారుల అండదండలుండడంతో పట్టపగలే యథేచ్ఛగా కలప తరలిస్తున్నారు. మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, మంగళ్‌పల్లి ప్రాంతాల నుంచి లారీల కొద్దీ కలప రవాణా చేస్తున్నారు. ఒక్కో లారీకి రూ.5వేలు ఇచ్చుకుంటే ఎంత కలప నరికినా పట్టించుకునే వారే లేరంటూ బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఓ అధికారిని కలిస్తే పని జరిగినట్లేనని గుసగుసలు వినిపిస్తున్నాయి.



తరలింపునకు సిద్ధంగా ఉన్న మొద్దులు

కఠినంగా వ్యవహరించాలి

ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం ప్రాంతాల నుంచి భారీగా కలప తరలిస్తున్నారు. అధికారులకు తెలిసే తతంగం నడుస్తున్నట్లు తెలుస్తోంది. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలి. అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలి. లేకుంటే పై స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తాం. – **జగదీష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు**

చర్యలు తీసుకుంటాం

కలప అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. నా దృష్టికి వస్తే ఎంతటివారైనా చర్యలు తీసుకుంటాం. కలప రవాణా చేస్తే చర్యలు తప్పవు. చెట్లను నరకడం నేరం. క్షేత్ర స్థాయి అధికారులు సైతం కఠినంగా వ్యవహరించాలి. – **శ్రీనివాస్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం రేంజ్ అధికారి**

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు

తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్‌ను మరోసారి నమ్మి మోసపోవద్దని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు. గురువారం తాండూరులోని ఆయన నివాసంలో నాలుగు మండలాల్లోని బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులతో వేర్వేరుగా సమీక్షించారు. అనంతరం కాంగ్రెస్ బాకీ కార్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ 22 నెలలుగా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ మోసాలను బాకీ కార్డు ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను విశ్వసించడం లేదని.. బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షకార్యదర్శులు, నాయకులు పట్లోళ్ల నర్సింలు, శ్రీనివాసాచారి, వెంకట్‌రెడ్డి, ఇందర్‌చెడ్ రాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.



కాంగ్రెస్ బాకీ కార్డును ఆవిష్కరిస్తున్న రోహిత్‌రెడ్డి తదితరులు

పంచాయతీ కార్మికుడి బలవన్మరణం

చేవెళ్ల: బావిలో దూకి పంచాయతీ కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలోని అంతారం అనుబంధ గ్రామం నౌలాయపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన తెలుగు భీమయ్య(58) అంతారం పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. ఉదయం 10 గంటల ప్రాంతంలో ఈతకు వెళ్తున్నాని భార్య అంజమ్మకు చెప్పి సైకిల్‌పై బయలుదేరాడు. ఆమె వద్దని వారించినా వినలేదు. భార్య చూస్తుండగానే గ్రామ సమీపంలోని బావిలోకి దూకి చేస్తూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఎంతకీ బయటకురాకపోడంతో కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. చేవెళ్ల ఫైర్ సిబ్బంది బావిలో గాలించి భీమయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి ద్దరు పిల్లలు ఉన్నారు. చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బీజేపీలో చేరిన వారితో రాజ్‌భూపాల్ గౌడ్

ప్రజల చూపు బీజేపీ వైపు

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితి లేదు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్

మహేశ్వరం: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేక బీజేపీ వైపు చూస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని గొల్లూరు గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు గురువారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనతో జనం విసిగిపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో అప్పటి సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఆయనను అనుసరిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో జగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు కడారి జంగయ్య యాదవ్, మండల అధ్యక్షుడు యాదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫినాయిల్ బాటిల్‌లో నీరు తాగి..

గురుకుల విద్యార్థికి అస్వస్థత



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హర్షవర్ధన్

షాద్‌నగర్‌రూరల్: ఫినాయిల్ బాటిల్‌లో నీరు పట్టుకుని తాగిన విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. ఈ ఘటన గురువారం గురుకుల హాస్టల్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి సమీపంలో వివేకానంద డిగ్రీ కళాశాల భవనంలో కేశంపేట జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల కొనసాగుతోంది. ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రికి చెందిన హర్షవర్ధన్ ఇక్కడ 10వ తరగతి చదువుతున్నాడు. గురువారం టిఫిన్ చేసిన విద్యార్థి తాగునీటి కోసం కులాయి వద్దకు వెళ్లాడు. కాగా అక్కడ వాడి పడేసిన ఫినాయిల్ బాటిల్ ఉంది. ఇది గమనించని విద్యార్థి అందులో వాటర్ పట్టుకుని తాగడంతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే హాస్టల్ సిబ్బంది షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకున్న హర్షవర్ధన్‌ను పాఠశాల సిబ్బంది ఇంటికి పంపారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

ఐడీబీఐ బ్యాంక్ ప్రాంతీయ కోఆర్డినేటర్ కునాల్

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తమ వంతుగా అండగా ఉంటామని ఐడీబీఐ బ్యాంక్ ప్రాంతీయ కో ఆర్డినేటర్ కునాల్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ ప్రాథమిక పాఠశాలకు బ్యాంక్ సీఎస్‌ఆర్ నిధులు రూ. 2 లక్షలతో కంప్యూటర్ టేబుల్‌లు, కుర్చీలు, క్లాస్ రూం రాక్‌లు, లైబ్రరీ రాక్‌లు, ఆఫీస్ టేబుల్‌లు, కుర్చీలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... తమ బ్యాంక్ తరపున ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలను కల్పించేందుకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట అధనపు తరగతులను నిర్మించామన్నారు. మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్, మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, బ్యాంక్ మేనేజర్ జయకుమార్, బ్యాంక్ రీజనల్ అధికారులు అఖిలేష్, జైసింగ్, ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ అనీస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

- యువకుడి వేధింపులే కారణమని కుటుంబసభ్యుల ఆరోపణ
- పరారీలో నిందితుడు



మౌలిక (ఫైల్)

అడ్డగుట్ట: ప్రేమ పేరుతో ఓ యువకుడి వేధింపులు తాళలేక ఓ విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘుబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లాలాపేటలోని సాయిబాబా దేవాలయం సమీపంలో నివాసముంటున్న ప్రమోద్‌కుమార్ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి. అతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి పెద్ద కుమార్తె మౌలిక(19) అలియాస్ వెన్నెల తార్నాకలోని రైల్వే డిగ్రీ కళాశాలలో బి.ఏ సెకండ్ ఇయర్ చదువుతుంది. అదే కాలేజీలో మాణికేశ్వర్ నగర్‌కు చెందిన అంబాజీ అనే యువకుడు కొన్ని నెలల క్రితం వాలీబాల్ కోచ్‌గా జాయిన్ అయ్యాడు. కొద్ది రోజులుగా అతను మౌలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన మౌలిక బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అంబాజీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతురాలి సెల్‌ఫోన్‌లో డేటా పూర్తిగా డిలీట్ చేసి ఉందని, డేటాను రిట్రీవ్ చేస్తున్నట్లు చెప్పారు. అంబాజీ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.